సాక్షి కామారెడ్డి

శనివారం ; 18 ; మార్చి ; 2023



ఆసరా ఏదీ?

ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్నాయి.

- IIలో ▸



ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

జిల్లాలోని పలు ప్రాంతాలలో పోలీసులు సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /18.7

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఆలయ నిర్మాణానికి రూ. 10 లక్షల విరాళం



మాచారెడ్డి: చుక్కాపూర్‌లో నిర్మిస్తున్న లక్ష్మీ నర్సింహస్వామి ఆలయానికి శుక్రవారం ఎంపీపీ లోయపల్లి నర్సింగారావు రూ.10 లక్షల విరాళం ఇచ్చారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చేతుల మీదుగా జెడ్పీటీసీ రాంరెడ్డి, గ్రామ నాయకులకు నగదు అందించారు. ఆలయ నిర్మాణానికి రూ. 10 లక్షల ఇచ్చిన ఎంపీపీకి జెడ్పీటీసీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్ రెడ్డి, రామ్మోహన్, అరవింద్, కృష్ణమూర్తి, రవీందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛత అవార్డు’కు దరఖాస్తు చేసుకోండి

కామారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛత ఉత్సవ పోటీల్లో భాగంగా ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డుకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. పట్టణంలోని స్వయం సహాయక సంఘాలు, పారిశుధ్య, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వచ్చేనెల 5వ తేదీలోగా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ (92915 85661), ఎన్విరాన్‌మెంట్ ఈఈ అబ్దుల్ మోమిన్ (86881 10983)ను సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ ద్వారా సీతారాముల కల్యాణ తలంబ్రాలు

కామారెడ్డి టౌన్: భద్రాచల సీతారాముల కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ భక్తుల ఇంటికి తీసుకువచ్చి అందించనుంది. ఇందుకోసం రూ. 116 చెల్లించి, బుక్ చేసుకుంటే సరిపోతుందని ఆర్టీసీ కామారెడ్డి డీఎం లక్కు మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుక్ చేసుకున్నవారికి శ్రీరామనవమి తర్వాత తలంబ్రాలను పంపిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు కామారెడ్డి డిపో(91542 98730), బాన్సువాడ (91542 98729) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మెడికల్ కాలేజీకి ఇద్దరు ప్రొఫెసర్‌ల నియామకం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మెడికల్ కాలేజీకి త్వరలో ఇద్దరు ప్రొఫెసర్‌లు రానున్నారు. రాష్ట్రంలో నూతనంగా మంజూరైన మెడికల్ కళాశాలలకు ప్రొఫెసర్‌లను నియమించారు. ఇందులో భాగంగా పదోన్నతుల పై ప్రొఫెసర్‌లుగా డాక్టర్ డీఎస్ జ్యోతి, డాక్టర్ సర్జా అడప్ప కామారెడ్డికి రానున్నారు. వారు వారం రోజుల్లో విధుల్లో చేరతారని తెలుస్తోంది.

అర్హులకు డబుల్ కేటాయించండి



ఎల్లారెడ్డి: అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని కోరుతూ ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ శుక్రవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతి పత్రం అందించారు. ఎల్లారెడ్డిలో డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించిన వారిలో కొంత మందికి ఇళ్లు, పొలాలు ఉన్నాయని ఆయన ఫిర్యాదు చేశారు. అర్హుల జాబితాను మరోసారి పరిశీలించాలని విన్నవించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాము, బీఆర్ఎస్ నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

బస చేసే స్థలం పరిశీలన



గాంధారి: హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహిస్తున్న రేవంత్‌రెడ్డి శనివారం రాత్రి గాంధారి మండలంలోని గుడిమెట్‌కు చేరుకుని, అక్కడే బస చేస్తారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్‌రెడ్డి, నాయకులు బస ఏర్పాట్లు చేస్తున్నారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సదాశివనగర్ సీఐ రామన్ శుక్రవారం బస చేసే స్థలాన్ని పరిశీలించారు.

అమ్మకు అందని ప్రోత్సాహం





బాన్సువాడ ఎంసీహెచ్‌లో స్కానింగ్ కోసం వేచి ఉన్న గర్భిణులు

సర్కారు దవాఖానాల్లో ప్రసవాలను పెంచడం, మాతా శిశు మరణాలను తగ్గించడం లక్ష్యాలుగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కేసీఆర్ కిట్ పథకాన్ని నిధుల కొరత వేధిస్తోంది. గర్భిణులు, బాలింతలుగా ఉన్నప్పుడు అందాల్సిన సాయం .. ఏళ్లు గడుస్తున్నా అందకపోవడంతో నిరాశ చెందుతున్నారు. జిల్లాలో కేసీఆర్ కిట్ నగదు ప్రోత్సాహకం కోసం ఎనిమిది వేల మంది ఎదురుచూస్తున్నారు.

- రెండేళ్లుగా విడుదల కాని కేసీఆర్ కిట్ నిధులు
- జిల్లాలో 8 వేల మంది ఎదురుచూపులు

బాన్సువాడ టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం ఐదేళ్ల క్రితం కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా నాలుగు విడతల్లో ప్రోత్సాహకాన్ని అందిస్తారు. ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణీగా పేరు నమోదు చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకోవడం, సర్కారు దవాఖానాలోనే డెలివరీ చేయించుకోవడం , బిడ్డకు సకాలంలో టీకాలు వేయించడం చేస్తే కేసీఆర్ కిట్ కింద ఆర్థిక సాయం అందనుంది. మగ బిడ్డ పుడితే రూ.12 వేలు, ఆడ శిశువు జన్మిస్తే రూ.13 వేలను ప్రభుత్వం అందిస్తుంది.

విడతలవారీగా నిధులు..

గర్భం దాల్చిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రిలో వివరాలు నమోదు చేయించుకుని కనీసం రెండుసార్లు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటే మొదటి విడతలో రూ. 3 వేలు ఇస్తారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ అయ్యి ఆడ బిడ్డకు జన్మనిస్తే రెండో విడతలో కేసీఆర్ కిట్ వస్తువులతోపాటు రూ. 5 వేలు, మగ బిడ్డ పుడితే రూ. 4 వేలు అందిస్తారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి మూడున్నర నెలల కాలంలో ఇవ్వాల్సిన టీకాలు తీసుకున్న తర్వాత మూడో విడత కింద రూ.2 వేలు, బిడ్డ పుట్టిన తొమ్మిది నెలల కాలంలో ఇవ్వాల్సిన టీకాలు తీసుకుంటే నాలుగో విడతలో భాగంగా రూ.3 వేలు ఇస్తారు. మొదట్లో ఈ పథకం సక్రమంగా అమలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. రానురాను ప్రభుత్వం నిధులు కేటాయింపుపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పథకానికి సంబంధించి రెండేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరిగి, విసిగి వేసారిపోతున్నారు. తమ చేతుల్లో ఏమీ లేదని, ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతాయని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. కేసీఆర్‌కిట్‌కు నిధుల కొరత లేకుండా చూడాలని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రెండేళ్లవుతోంది..

బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో రెండేళ్ల క్రితం సాధారణ ప్రసవం జరిగింది. ఆడబిడ్డ జన్మించింది. కేసీఆర్ కిట్ వస్తువులు ఇచ్చారు. ఆడపిల్ల పుడితే రూ. 13 వేలు ఇస్తామన్నారు. పాపకు రెండేళ్లు వచ్చాయి. కానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా రాలేదు. – లత, కొత్తాబాది

డబ్బులు రాలేదు..

ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ చేసుకుంటే కేసీఆర్ కిట్ పథకం వర్తిస్తుందని చెప్పారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలోనే పరీక్షలు చేయించుకుంటున్నాం. ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భవతిని. మొదటి విడత డబ్బులు ఇప్పటివరకు ఇవ్వలేదు. – అనిత, బీర్కూర్

లబ్ధిదారుల ఖాతాల్లోనే జమవుతాయి

ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకునే గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే కేసీఆర్ కిట్‌కు సంబంధించిన ప్రోత్సాహక నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ అవుతుంది.

– శ్రీనివాస్‌ప్రసాద్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, బాన్సువాడ

‘ధరణి’లో 8 ప్లాట్ల అమ్మకం



ప్లాట్ల వేలం నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణ పరిధిలోని ధరణి టౌన్‌షిప్ ప్లాట్ల వేలం ప్రక్రియ కొనసాగుతోందని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. శుక్రవారం రెండో రోజు ఎనిమిది ప్లాట్లను అమ్మడం ద్వారా ప్రభుత్వానికి రూ. 96.75 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. కలెక్టరేట్ లో వేలం ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి టౌన్‌షిప్ పూర్తి విస్తీర్ణం 50.29 ఎకరాలు ఉందన్నారు. చుట్టూ రక్షణ గోడతో సహా లేఅవుట్ చేసిన గేటెడ్ కమ్యూనిటీ టౌన్‌షిప్‌లో 45 అడుగుల ప్రధాన రహదారులు, 30 అడుగుల అంతర్గత రహదారులు ఉన్నాయన్నారు. 266, 200, 150, 100 చదరపు గజాల ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు కలెక్టర్ పేరుమీదుగా ఈఎండీ రూ. 10 వేలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఎలాంటి చిక్కులు లేని ప్లాట్లను వేలంపాట ద్వారా ప్రజలు సొంతం చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 858 మంది గైర్హాజరు

కామారెడ్డి టౌన్: జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 858 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 9,862 మందికిగాను 9,003 మంది విద్యార్థులే పరీక్ష రాశారు. జనరల్ గ్రూప్‌లలో 729 మంది, వొకేషనల్‌లో 129 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.

‘ఇకపై అన్ని ఎన్నికల్లోనూ బీజేపీదే గెలుపు’



వెంకటరమణారెడ్డికి స్వీట్ తినిపిస్తున్న నేతలు

కామారెడ్డి టౌన్: ఇకపై రాబోయే అన్ని ఎన్నికల్లోనూ బీజేపీదే గెలుపని ఆ పార్టీ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ టీచర్ల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు శుక్రవారం జిల్లావ్యాప్తంగా సంబురాలు చేసుకున్నారు. కామారెడ్డిలో స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి కామారెడ్డిలోని తన నివాసంలో మాట్లాడారు. అధికార పార్టీని ఎదిరించి, బీజేపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. మేధావులతో పాటు అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపు ఉన్నారన్నారు. ప్రజలు అవినీతి రహిత పాలన కోరుకుంటున్నారని, బీజేపీతోనే అది సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మోటూరి శ్రీకాంత్, కౌన్సిలర్‌లు నరేందర్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

‘పేదలందరికీ పక్కా ఇళ్లు’

వర్ని: బాన్సువాడ నియోజకవర్గంలో పేదలందరికీ పక్కా ఇల్లు ఉండాలన్నదే తన లక్ష్యమని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. వర్నిలోని షాదీఖానాలో శుక్రవారం డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు బిల్లులను అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సహకారంతో బాన్సువాడ నియోజకవర్గానికి 11 వేల డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయన్నారు. త్వరలో రూ. 3 లక్షల హౌసింగ్ స్కీం వస్తుందని, అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిదాస్, వైస్ ఎంపీపీ దండ్ల బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

- డంపింగ్ యార్డుల్లో సేంద్రియ ఎరువులు తయారు చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కామారెడ్డి క్రైం: ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో పల్లె ప్రగతి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 78 శాతం పన్నులు వసూలయ్యాయన్నారు. క్షేత్రస్థాయిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, ఈనెలాఖరులోగా పన్నుల వసూలు లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. మిషన్ అంత్యోదయను 20వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లోని నర్సరీలలో విత్తనాలు నాటాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో గ్రామాల్లో పొడి చెత్తను సేకరించాలన్నారు. తడిచెత్తను సేకరించి గ్రామాల్లోని డంపింగ్ యార్డ్‌కు తరలించి సేంద్రియ ఎరువులను తయారు చేయాలన్నారు. తయారు చేసిన సేంద్రియ ఎరువులను రైతులకు విక్రయించి పంచాయతీలు ఆదాయాన్ని పెంపొందించుకోవాలన్నారు. వైకుంఠధామాలలో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పల్లె ప్రగతి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, డీఆర్‌డీవో సాయన్న, డీపీవో శ్రీనివాసరావు, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, స్వచ్ఛ భారత్ సమన్వయకర్త నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

సాధించుకుందాం.. ఇందిరమ్మ రాజ్యం

- మతం ముసుగులో ప్రజలను చీల్చే కుట్ర చేస్తున్న బీజేపీ
- తాను పీసీసీ అధ్యక్షుడు కావడానికి ఆర్మూర్ రైతుల దీక్ష మొదటి మెట్టు
- ఆస్తులు పెంచుకోవడం పైనే ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఆయన సోదరుడి దృష్టి
- ఆర్మూర్ కార్నర్ మీటింగ్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శలు



పెర్కిట్‌లో యాత్ర నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, షబ్బీర్ అలీ, ఈరవత్రి అనిల్



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

ఆర్మూర్: వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తిరిగి సాధించుకోవాలంటే తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం సాధించుకోవడం ఒక్కటే మార్గమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు నిచ్చారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా పెర్కిట్ శివారు నుంచి మామిడిపల్లి చౌరస్తా మీదుగా ఆర్మూర్‌లోని పాత బస్టాండ్ వరకు శుక్రవారం పాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో నిజాంసాగర్, శ్రీరాంసాగర్, పోచారం ప్రాజెక్టులు, గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతలు, మెడికల్ కళాశాల, తెలంగాణ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తే 2014లో తొమ్మిది మంది కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించడం తగునా అని రేవంత్ రెడ్డి ఓటర్లను ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లను అమలు చేశామన్నారు. 2019 తర్వాత పసుపు బోర్డు ఏర్పాటు కోసం ఆర్మూర్ ప్రాంత రైతాంగం చేస్తున్న ఉద్యమాల గురించి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి తన దృష్టికి తీసుకువచ్చి తనను ఉద్యమంలో పాల్గొనాలని సూచించారన్నారు.. ఆలస్యంగానైనా ఆ రైతు దీక్షకు తాను హాజరయ్యానన్నారు. తాను రైతులు, ప్రజలకు అండగా నిలబడటాన్ని గుర్తించి ఏఐసీసీ అధిష్టానం తనను పీసీసీ అధ్యక్షుడిగా నియమించిందనాన్నారు. 2021 జనవరి 30న నిర్వహించిన రైతు దీక్ష తాను పీసీసీ అధ్యక్షుడిని కావడానికి మొదటి మెట్టుగా ఉపయోగపడిందన్నారు. ఈ ప్రాంత రైతాంగానికి తాను రుణపడి ఉంటానన్నారు.

అంతకు ముందు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్, మాజీ మంత్రులు షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనిల్ మాట్లాడారు. కార్నర్ మీటింగ్‌లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి అంజని కుమార్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మార చంద్రమోహన్, ఏబీ శ్రీనివాస్ చిన్న, కోల వెంకటేశ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శం ఆర్మూర్ రైతాంగం

దేశానికే ఆదర్శంగా నిలబడిన పసుపు, ఎర్రజొన్న, సోయా, చెరుకు పండించిన రైతులు అంకాపూర్ మొదలుకొని చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్నారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆగర్భ శ్రీమంతులు బంజారా హిల్స్‌లో నిర్మించుకున్న తరహా ఇళ్లు ఈ ప్రాంత రైతులు నిర్మించుకున్నారని అభినందించారు. ఆర్మూర్ ప్రాంతం మాజీ మంత్రి అర్గుల్ రాజారాం, మాజీ మంత్రి సంతోష్‌రెడ్డి లాంటి గొప్ప నేతలను అందించిందని, మాజీ సీఎం టి అంజయ్య సైతం ఆర్మూర్ నుంచే గెలుపొందారని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్‌లో ఉన్నత పదవులు అనుభవించిన సురేశ్ రెడ్డి, ఆకుల లలితలు బీఆర్ఎస్ నాయకుల చేతుల్లో ఓటమి పాలై, తిరిగి వారి పంచనే చేరి వారి ఎంగిలి మెతుకులకు దిగజారారని విమర్శించారు.

నేడు కామారెడ్డిలో జోడో యాత్ర

- రాజంపేటలో కార్నర్ మీటింగ్
- కామారెడ్డిలో బహిరంగ సభ
- ఏర్పాట్లు చేస్తున్న కాంగ్రెస్ నేతలు
- జిల్లాకేంద్రానికి చేరుకున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర శనివారం కామారెడ్డి నియోజకవర్గంలో కొనసాగనుంది. యాత్ర నేపథ్యంలో రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రే జిల్లాకేంద్రానికి చేరుకుని, పట్టణంలోని క్లాసిక్ గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో బస చేశారు. ఆయన శనివారం ఉదయం కామారెడ్డి నియోజకవర్గంలోని సరంపల్లి చౌరస్తా నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నారు. సరంపల్లి, చిన్న మల్లారెడ్డి మీదుగా రాజంపేట మండల కేంద్రం వరకు యాత్ర సాగుతుంది. ఉదయం 10 గంటల ప్రాంతంలో రాజంపేటలో కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడతారు. తిరిగి సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులో గల దేశాయి బీడీ ఆఫీస్ నుంచి పాదయాత్ర ప్రారంభించి సిరిసిల్ల రోడ్డు, ఇందిరాచౌక్, రైల్వే బ్రిడ్జి మీదుగా నిజాంసాగర్ చౌరస్తా వరకు నడవనున్నారు. 6 గంటలకు నిజాంసాగర్ చౌరస్తాలో నిర్వహించే సభలో ప్రసంగిస్తారు. రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ ఎత్తున జనసమీకరణ చేయడంపై దృష్టి సారించారు.

విజయవంతం చేయాలి

హాథ్ సే హాథ్ జోడో యాత్రను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే.. అధికారం చేపట్టిన సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ చేస్తానని చెప్పి తన కుటుంబాన్ని మాత్రమే బంగారుమయం చేసుకున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో నిరంకుశ పాలనకు చరమ గీతం పాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర శనివారం కామారెడ్డి నియోజకవర్గంలో సాగుతుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా నిర్వహించే పాదయాత్ర, కార్నర్ మీటింగ్, బహిరంగ సభలకు భారీగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.



పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ, కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

విద్యుత్‌చౌర్యం చేస్తే చర్యలు



భిక్కనూరు : ఎవరైనా విద్యుత్‌ను చౌర్యం చేసి వాడుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏడీ కిరణ్ చైతన్య అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీ సిద్దరామేశ్వరనగర్ గ్రామంలో విద్యుత్ కనెక్షన్లను ఆయన తనిఖీ చేశారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ తీగలు ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా వేలాడుతుంటే సిబ్బంది వెంటనే సరిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట సబ్ ఇంజినీర్ శ్రీనివాస్, లైన్‌ఇన్‌స్పెక్టర్ బాల్‌రాజు, లైన్‌మన్ మాణిక్యం, జేఎల్‌ఎం లక్ష్మణ్ ఉన్నారు.

ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల గడువు పొడిగింపు

డిచ్‌పల్లి : సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నడుస్తున్న 5వ తరగతి 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశపరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు సమన్వయాధికారిణి మేరీ ఏసుపాదం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–23 విద్యా సంవత్సరంలో ఏదైనా ప్రభు త్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మై నార్టీలకు చెందిన విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు www.trwreir.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం www.trwreir.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించలన్నారు.

పాఠశాలలో చోరీ



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలికలు ప్రాథమిక పాఠశాల తలుపులు పగులగొట్టి చోరీ చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పాఠశాల హెచ్‌ఎం సూరయ్య రోజువారీగా గురువారం మధ్యాహ్నం పాఠశాలకు తాళాలు వేసి వెళ్లారు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వచ్చి చూడగా స్టాఫ్ రూం తలుపులు పగుటగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా టీచర్లు వేలిముద్రలు వేసే బయోమెట్రిక్ మిషన్, మైక్‌సెట్, స్పీకర్‌తో పాటు ఇతర చిన్న వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దాంతో హెచ్‌ం సూరయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై పాఠశాలకు చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: ఒకరి మృతి



డిచ్‌పల్లి : డిచ్‌పల్లి మండలంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై యూనివర్సిటీకి వెళ్లే రోడ్డులోని కేపీ దాబా వద్ద లారీ బైక్ ఢీకొని ఒకరు మృతిచెందినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. యూనివర్సిటీ రోడ్డులో ఏపీ 25ఎఫ్ 9119 నెంబర్ యమహా బైక్‌పై హుసేన్‌ఖాన్(19)ను అదే రూట్‌లో వెళ్తున్న టీఎస్ 52ఎల్ 9277 లారీ అతివేగంగా వచ్చి ఢీకొనడంతో బైకిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108లో నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు బీటెక్ సెకండియర్ చదువుతున్నట్లు తెలిపారు.

తోడులేనోళ్లకు ఆసరా ఏదీ..?



- మంజూరు కాని కొత్త పింఛన్లు
- కుప్పలు తెప్పలుగా దరఖాస్తుల పెండింగ్
- పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూపులు

నిజాంసాగర్(జుక్కల్) : రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, బీడీ, చేనేత, గీత కార్మికులకు ఆసరా పథకం కింద ప్రతినెలా పింఛన్ డబ్బులను పంపిణీ చేస్తోంది. వికలాంగులకు నెలకు రూ. 3,016 ఇస్తుండగా మిగితావారికి నెలకు రూ. 2,016 ఇస్తోంది. జిల్లాలో 1,54,540 మంది లబ్ధిదారులకు రూ. 330 కోట్ల మేరకు ఖర్చు చేస్తోంది. అయితే కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో వేలల్లో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆన్‌లైన్ చేస్తున్నప్పటికీ..

జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో ఆసరా పెన్షన్ దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా పెండింగ్ ఉన్నాయి. ఆసరా పెన్షన్ దరాఖాస్తులను మండల పరిషత్ కార్యాలయల్లో ఆన్‌లైన్ చేస్తున్నా సీఆర్‌డీ నుంచి మంజూరు చేయడం లేదు. అంతేకాకుండా వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వారు చనిపోతే వితంతువులకు మరుసటి నెలలోనే పింఛన్ ఇస్తామని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ ఆచరణలో సాధ్యం కాలేదు. వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్తలను కోల్పోయిన వితంతువులతో పాటు అనారోగ్యం, రోడ్డు ప్రమాదాల్లో భర్తలను కోల్పోయిన అభాగ్యుల వింతగోసను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. భర్తలను కోల్పోయిన వితంతువులు ఆసరా పెన్షన్ కోసం జీపీ సిబ్బందికి అన్ని సర్టిఫికెట్లతో కూడిన దరఖాస్తులను సమర్పించినప్పటికీ పింఛన్ మంజూరు కావట్లేదని వారు వాపోతున్నారు.



చిత్రంలో కనిపిస్తున్న వితంతువు పేరు తలారి బాలవ్వ. బూర్గుల్ గ్రామం. జుక్కల్ మండలం. ఆమె భర్త తలారి నాగయ్య గతేడాది డిసెంబర్ 12న మృతి చెందాడు. వృద్ధాప్య పింఛన్ పొందుతున్న నాగయ్య మృతి చెంది నాలుగు నెలలైంది. ప్రస్తుతం బాలవ్వకు వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదు. భర్తను కోల్పోయిన బాలవ్వ పింఛన్ ప్రస్తుతం అవస్థలు పడుతోంది.

పింఛన్ అందించి ఆదుకోవాలి



పశువుల కాపరిగా పనిచేసిన నా భర్త సురేందర్ ప్రమాదవశాత్తు బురదనీటిలో పడి మృతి చెందాడు. భర్తను కోల్పోయి ఆర్నెళ్లు కావస్తున్నా ఆసరా పెన్షన్ మంజూరు కాలేదు. పింఛన్ అందించి ఆదుకోవాలి.

– ఒడ్డె సుజాత, వితంతువు, బూర్గుల్

ర్యాగింగ్ ఘటనలో మలుపులెన్నో..

- రెండు గ్రూపులుగా విడిపోయిన తిరుమల ఫార్మసీ కళాశాల విద్యార్థులు
- సీపీకి ఒకరిపై ఒకరు ఫిర్యాదు
- ఇద్దరు జూనియర్ విద్యార్థులపై కేసు
- నలుగురు విద్యార్థులపై సస్పెన్షన్ వేటు..!

ఖలీల్‌వాడి : తిరుమల ఫార్మసీ కాలేజీ ర్యాగింగ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. బీ ఫార్మసీ రెండో, మూడవ సంవత్సరం విద్యార్థులు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. శుక్రవారం కళాశాలకు సంబంధించిన సెకండ్ ఇయర్, థర్డ్ ఇయర్ విద్యార్థులు ర్యాగింగ్ విషయమై రెండు గ్రూప్‌లుగా ఏర్పడి ఒకరిపై ఒకరు పోలీస్ కమిషనర్ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. అయితే థర్డ్ ఇయర్ విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేసి సెకండ్ ఇయర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆదివారం ఫ్రెషర్స్ డే సందర్భంగా కళాశాలలో సెకండ్ ఇయర్ విద్యార్థులు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ వేడుకలకు థర్డ్ ఇయర్ విద్యార్థులను ఆహ్వానించేందుకు వెళ్లగా అక్కడ ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. అయితే సెకండ్ ఇయర్ విద్యార్థులు తమను సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడ్డారని పేర్కొంటూ గురువారం తమ కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా వారు కళాశాలకు వచ్చి ఆందోళన చేశారు. డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగానే ఇద్దరు సీనియర్ విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. తమ తల్లిదండ్రులను పిలిచినందుకు కళాశాల యాజమాన్యం నలుగురు విద్యార్థులను సస్పెండ్ చేసినట్లు విద్యార్థులు ఆరోపించారు.



సీపీని కలిసేందుకు వచ్చిన ఫార్మసీ విద్యార్థులు

విచారణ జరిపిన ఏసీపీ

డిచ్‌పల్లి(నిజామాబాద్ రూరల్) : డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ శివారులోని తిరుమల కాలేజీలో ర్యాగింగ్, దాడి ఘటనపై శుక్రవారం ఏసీపీ కిరణ్ కుమార్ సాయంత్రం విచారణ జరిపారు. కాలేజీకి సంబంధించిన నియమనిబంధనలు అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులుగా కాలేజీలో జరుగుతున్న ఘటనకు సంబంధించిన వివరాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలను ఏసీపీ పరిశీలించి, ఈ ఘటనకు సంబంధించి విద్యార్థులకు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సీనియర్ విద్యార్థిని కొట్టిన ఘటనలో ఇద్దరు జూనియర్లపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు పరస్పరం సీపీ నాగరాజు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ విచారణకు ఏసీపీతో సీఐ మోహన్, ఎస్సై గణేష్‌లు పాల్గొన్నారు.



కళాశాలలో విచారణ చేస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

బోర్లు ఎత్తిపోయి.. సాగు ఆగమయ్యె..



యాసంగి వరి సాగు చేస్తున్న రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ప్రారంభంలో మొగి పురుగు, తర్వాత అగ్గి తెగుళ్లతో ఇబ్బందులు పడ్డ రైతులు తాజాగా బోర్లు ఎత్తిపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారు. సగం వరకు పెరిగిన వరిపంట నీళ్లు లేక ఎండిపోతుండడంతో ఆ భూముల్లో పశువులు, గొర్లకు మేపుతున్నారు. శుక్రవారం రెడ్డిపేట గ్రామానికి చెందిన రైతు స్వామి ఒకటిన్నర ఎకరంలో వరి సాగుకు నీళ్లు అందక గొర్ల మేతకు గొల్లకుర్మలకు ఇచ్చేశాడు. నాట్లకు, అనంతరం తెగుళ్ల నివారణకు పెట్టుబడి విపరీతంగా పెరిగినప్పటికీ పంట చేతికందకపోవడంతో రైతు కన్నీటిపర్యంతమవుతున్నాడు.

- రామారెడ్డి

ఇందూరు తిరుమలలో సినీ సందడి



కథ విషయమై దిల్ రాజుతో చర్చిస్తున్న దర్శకులు త్రినాథ రావు, నిర్మాత కృష్ణ

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలోని నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సినీ ప్రముఖులతో సందడిగా మారింది. నిత్యం సినిమాల్లో బిజీబిజీగా ఉండే ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఐదారు రోజులుగా తన స్వగ్రామమైన నర్సింగ్‌పల్లిలోనే ఉంటున్నారు. దీంతో నిర్మాతలు, దర్శకులు ఆలయానికి వచ్చి సినిమాలకు కథలను విన్పిస్తున్నారు. అలాగే స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాలుపంచుకుంటూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తాజాగా ధమాకా సినీ దర్శకుడు నక్కి త్రినాథ రావు, నిర్మాత కృష్ణ, గురువారం గుణశేఖర్, అనిల్ రావుపూడి వచ్చి కొత్త సినిమాలకు కథలను విన్పించినట్లు తెలిసింది.

క్రైం కార్నర్

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

నిజామాబాద్‌నాగారం : నగరంలోని కంఠేశ్వర్ శివారులో వ్యవసాయ పొలంలో యెండల సురేందర్‌కు చెందిన రైతు గేదె విద్యుత్‌షాక్‌కు గురై చనిపోయింది. విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి వచ్చి పంచనామా చేశారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గణేష్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణంలోని చర్చి కాంపౌండ్‌లో నివాసముండే జంగమాయిపేట కార్తీక్ (35) తరుచు మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవ పడేవాడని ఇదే విషయంలో గురువారం రాత్రి గొడవ జరగడంతో అతడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. భార్య, భర్తలు గొడవ పడడంతో భార్య కీర్తి బంధువుల ఇంటిలోకి వెళ్లి పడుకోగా కార్తీక్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. మృతుడి భార్య కీర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు



గంజాయి విక్రేతల అరెస్ట్‌ను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

ఆర్మూర్‌టౌన్ : నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం పోచంపాడ్ గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ తెలిపారు. వివరాలను ఆర్మూర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో వెల్లడించారు. శుక్రవారం ఉదయం పోచంపాడ్ ప్రాజెక్ట్ సమీపంలోని ఒక షెడ్‌లో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి నిందితులు కల్యాణ్, సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితులకు గంజాయి సరఫరా చేసిన నిర్మల్‌కు చెందిన రాజ్‌కుమార్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 230 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఎ గంగాధర్, సిబ్బంది వికాస్ గౌడ్, నరేశ్, దేవిదాస్, మోహన్, సందీప్, సాయిలు పాల్గొన్నారు.

మత్తులో వృద్ధురాలిపై దాడి

- దోంచందలో ఘటన
- యువకులు గంజాయి సేవించి ఉంటారని అనుమానం..!

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం దోంచందలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న ఒక వృద్ధురాలిపై ముగ్గురు యువకులు దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. దోంచందకు చెందిన ఒక యువకుడితో పాటు ఏర్గట్లకు చెందిన మరో ఇద్దరు కారులో వచ్చి సిగరెట్లు కొనుగోలు చేశారు. వీటికి సంబంధించిన డబ్బులు అడిగినందుకు దుకాణంలోని సామగ్రిని చిందరవందర చేశారు. అడ్డు వచ్చిన వృద్ధురాలిని పక్కకు నెట్టేయడంతో ఆమె కిందపడి గాయాలపాలైంది.

వృద్ధురాలిపై దాడిని అడ్డుకోవడానికి వచ్చినవారిని దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించినట్లు తెలిసింది. ముగ్గురు యువకులు మత్తులో ఉన్నారని వారు మద్యం సేవించారా లేక గంజాయి సేవించారో అర్థం కాలేదని స్థానికులు తెలిపారు. కారును వేగంగా తిప్పుతూ ఒకరిద్దరిని ఢీకొట్టే ప్రయత్నం చేయగా వారు తప్పించుకున్నారు. ఈ విషయమై 'సాక్షి' ఏర్గట్ల ఎస్సై రాజును సంప్రదించగా వృద్ధురాలిపై దాడి ఘటన తన దృష్టికి వచ్చిందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ఎలాంటివారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. దోంచంద ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు.

విద్యార్థుల చేతుల్లో 'అభ్యాస దీపిక'

- పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదోతరగతి విద్యార్థులు
- ప్రత్యేకంగా మాదిరి ప్రశ్నావళి రూపకల్పన చేసిన ఎస్‌సీఈఆర్‌టీ



అభ్యాస దీపిక ముఖచిత్రం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మరో 15 రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పదోతరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది ఎస్‌సీఈఆర్‌టీ చేత ప్రత్యేకంగా అభ్యాస దీపికలను రూపొందించి విద్యార్థులకు సరఫరా చేశారు. అభ్యాస దీపికల్లో మాదిరి ప్రశ్నాపత్రాలతోపాటు లఘు, వ్యాసరూప, బహుళైచ్ఛిక ప్రశ్నలు, జవాబులు పొందుపర్చారు. గణితం, జీవ శాస్త్రం, భౌతికశాస్త్రం, సాంఘికశాస్త్రంకు సంబంధించిన అభ్యాస దీపిక సెట్‌ను ఒక్కో విద్యార్థికి అందజేశారు. జిల్లాలోని జెడ్పీ, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలకు చెందిన పదోతరగతి విద్యార్థులకు అభ్యాస దీపికల సెట్‌లను ప్రభుత్వం సమకూర్చింది. జిల్లా వ్యాప్తంగా 295 పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న 11,899 మంది విద్యార్థులకు అభ్యాస దీపికల సెట్లను అందించారు. పదోతరగతికి సంబంధించి తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులకు అభ్యాస దీపికలను అందించలేదు. కేవలం గణితం, జీవ, భౌతిక, సాంఘిక శాస్త్రాలకు మాత్రమే అభ్యాస దీపికలను ఇచ్చి మిగితా సబ్జెక్టులకు అందించకపోవడంపై విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులచే రూపొందించిన అభ్యాస దీపికలు కొంత ఆలస్యంగా గత నెలాఖరున విద్యార్థులకు చేరాయి. రెండునెలల ముందుగానే అభ్యాస దీపికలు విద్యార్థుల చేతికంది ఉంటే వారికి మరింత లబ్ధి చేకూరేదని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

చిన్నారి గాయాలపాలు

- వేడిపాలు పడి నాలుగేళ్ల పునర్విక తీవ్రగాయాలు
- చికిత్సకు డబ్బుల్లేక తల్లిదండ్రుల అవస్థలు
- సాయంకోసం ఎదురుచూపులు



గోపాల్‌పేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి పునర్వి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : వేడివేడి పాలు మీద పడి ఓ చిన్నారి నరకయాతన అనుభవిస్తోంది.. ఆ చిన్నారి బాధను తట్టుకోలేక తల్లిదండ్రులు అల్లాడిపోతున్న ఘటన నాగిరెడ్డిపేటలో ఆలస్యంగా వెలుగుచూసింది. నాగిరెడ్డిపేటకు చెందిన తెనుగు కిష్టయ్య, ఏసవ్వ దంపతుల కూతురు మాధవిని కొంతకాలం క్రితం ఎల్లారెడ్డి మండలం అల్మాజీపూర్‌కు చెందిన బొల్లారపు సంగమేశ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. కాగా మాధవి తన నాలుగేళ్ల కూతురు పునర్వితో కలిసి కొన్నిరోజులుగా తన తల్లిగారి ఇంట్లో ఉంటుంది. రెండురోజుల క్రితం మాధవి గ్యాస్‌పొయ్యిపై పాలను వేడిచేసి పెట్టింది. అదే సమయంలో పునర్వి గ్యాస్‌పొయ్యి పైపును పట్టుకొని లాగడంతో పొయ్యి కదిలి దానిపై ఉన్న వేడిపాలు ఆ చిన్నారిపై పడ్డాయి. దీంతో తీవ్రగాయాలయ్యాయి. దీనిని గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పునర్విని మండలకేంద్రం గోపాల్‌పేటలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా వేడిపాలు మీదపడడంతో పునర్వి 35–40శాతం గాయపడిందని ఆస్పత్రి వైద్యుడు పేర్కొన్నారన్నారు. కడు బీదరికంలో ఉన్న పునర్వి తల్లిదండ్రులు ప్రస్తుతం ఆమెకు చికిత్స చేయించలేకపోతున్నారు. రెండురోజుల్లోనే రూ. 20వేల వరకు ఖర్చయ్యాయని..దాతలెవరైన ముందుకొచ్చి తమను ఆదుకోవాలని తల్లిదండ్రులే వేడుకుంటున్నారు.

దాతలు ఆర్థిక సహాయం చేయాలనుకునే వారు పునర్వి తాత నగేశ్ గూగుల్ పే, ఫోన్‌పే 94408 23521కు చేయవచ్చు.

మేకల సంతకు ముగిసిన వేలం

- రూ. 55,16,000లకు దక్కించుకున్న సిరాజుద్దీన్
- వాయిదా పడ్డ కూరగాయల సంత వేలం



వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

నవీపేట : మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే మేకల సంతకు శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో రూ. 55,16,000ల ఆదాయం వచ్చింది. ఈనెల 13న మేకలు, కూరగాయల సంతలకు వేలం నిర్వహించారు. కానీ నిర్ణీత గడువులో నాల్గో వంతు డబ్బులు చెల్లించకపోవడంతో వాటిని రద్దు చేసి మళ్లీ నిర్వహించారు. మేకల సంతకు 38 మంది రూ. లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. రూ. 55,13,000ల నుంచి వేలం నిర్వహించగా సిరాజుద్దీన్ అనే వ్యక్తి రూ. 55,16,000కు మేకల సంతను వేలంలో దక్కించుకున్నారు. అలాగే కూరగాయల సంతకు రూ. లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించిన 12 మంది వేలంలో పాల్గొన్నారు. రూ. 15 లక్షల వద్ద వ్యాపారులు ఆగిపోయారు. దీంతో కనీస ధర రాలేదని ఈ సంత వేలాన్ని వాయిదా వేశారు. దీంతో పాటు వాటర్ ప్లాంట్, సులభ్ కాంప్లెక్స్‌లకు కనీస ధర రాకపోవడంతో వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆసోల్ల శ్రీనివాస్, కార్యదర్శి రవీందర్‌నాయక్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిర్నాపల్లిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ తేలు విజయ్

ధర్పల్లి (ఇందల్వాయి) : ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి రైల్వేస్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపేలా కృషి చేయాలని సర్పంచ్ తేలు విజయ్ ఆధ్వర్యంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఏడీఆర్‌ఎం రామకృష్ణకు శుక్రవారం విన్నవించారు. రైల్వే విద్యుద్దీకరణ పనులను పరిశీలించడానికి వచ్చిన ఆయనను గ్రామస్తులు సిర్నాపల్లి రైల్వే స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సిర్నాపల్లి రైల్వేస్టేషన్‌లో రెండవ ఫ్లాట్ ఫారం ఏర్పాటు చేయాలని, రైల్వే ఫుడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఆయనను కోరారు. ప్రయాణికుల భద్రత నిమిత్తం స్టేషన్ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. అంతేకాకుండా కాచిగూడ, అకోలా రైళ్లను స్టేషన్లో ప్రయాణికుల సౌకర్యం ఆగేలా చూడాలని ఏడీఆర్‌ఎంకు విన్నవించారు.

వ్యభిచారం కేసులో మూడేళ్ల జైలుశిక్ష

బోధన్‌టౌన్(బోధన్) : వ్యభిచారానికి ఆశ్రయం కల్పించినందుకు అలాగే వ్యభిచారం చేసిన కేసులో ఇద్దరికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ బోధన్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి దేవన్ అజయ్‌కుమార్ శనివారం తీర్పు చెప్పారు. అడిషనల్ పీపీ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూర్ పీఎస్ పరిధిలోని అక్బర్ నగర్‌లోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారం మేరకు 2019 మార్చి 1న పోలీసులు ఓ ఇంటిపై దాడి చేయగా ఫాతిమాబీ, ఊషం మల్కయ్య, షేక్ లతీఫ్ వ్యభిచారం నిర్వహిస్తూ పట్టుబడ్డారు. ఇందులో వ్యభిచారానికి ఆశ్రయం కల్పించిన ఫాతిమాబీకి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 200 జరిమానా విధించారు. జరిమానా కట్టకపోతే మరో నెలరోజుల సాధారణ జైలు శిక్ష, అలాగే మరోమహిళతో వ్యభిచారం నిర్వహిస్తూ పట్టుబడ్డ ఊషం మల్కయ్యకు మూడేళ్ల జైలు, రూ. 300 జరిమానా, జరిమానా కట్టకపోతే 15రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. షేక్ లతీఫ్ విచారణ సమయంలోనే మృతి చెందాడు.

పోలీసుల అదుపులో నిందితులు



ధ్వంసమైన మీసాల చంద్రయ్య కారు(ఫైల్)

ఖలీల్‌వాడి : డిచ్‌పల్లి మండలంలోని మాధవనగర్ సాయిబాబా ఆలయం వద్ద ఈనెల 10న బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య వెళ్తున్న కారుపై రాళ్లదాడి జరిగిన విషయం విదితమే..ఈ సంఘటనపై బీజేపీ నాయకులు అదేరోజు రాత్రి డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దాడి చేసిన ఇద్దరిని పోలీసుల అదుపులోకి తీసుకుని విచారించి వదిలేసినట్లు సమాచారం. బీఆర్‌ఎస్ నేతలే ఆరోజు కారుపై దాడి చేసినట్లు నగరంలో జోరుగా ప్రచారం జరిగింది. అయితే జిల్లాకు చెందిన ఓ బీజేపీ ముఖ్య నాయకుడు పలువురికి డబ్బులు చెల్లించడంలో ఇబ్బందులకు గురిచేయడంతో వారు అతడిపై ఆగ్రహంగా ఉన్నారు. ఈనెల 10న మీసాల చంద్రయ్య వెళ్తున్న కారులో సదరు ముఖ్య నాయకుడు ఉన్నాడనే సమాచారంతో వారు కారుపై రాళ్ల దాడికి పాల్పడ్డట్లు తెలిసింది.

పెట్రోల్ పంప్ సిబ్బందిపై దాడి ఘటనలో..

నస్రుల్లాబాద్(బీర్కూర్) : బీర్కూర్ మండల కేంద్రంలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపులో గురువారం రాత్రి పంపులో పనిచేసే వ్యక్తి నుంచి డబ్బులు తీసుకుని పారిపోవడానికి ప్రయత్నం చేశారు. ఫోన్‌పేలో డబ్బులు వేస్తామంటూ ఆఫీసులోకి వచ్చి విధుల్లో ఉన్న వ్యక్తిపై దాడి చేశారు. వెంటనే స్పందించిన కొందరు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితులు బాన్సువాడ పట్టణానికి చెందిన సందీప్, సోమేశ్వర్‌కు చెందిన సంతోష్‌లుగా పోలీసులు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని వివరాలను సేకరిస్తున్నామన్నారు. పెట్రోల్ పంప్‌లో డ్యూటీలో ఉన్న నాగరాజుకు తలపై గాయం కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.